క్లుప్తంగా

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మందస: మహేంద్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా మందసలో జరుగుతున్న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు బుధవారంతో ముగిశాయి. పోటీల్లో విజేతగా పర్లాకిమిడికి చెందిన అమెన్, యోగీంద్ర జట్టు, రన్నర్‌గా శ్రీకాకుళంకు చెందిన తరుణ్, శివ జట్టు నిలిచింది. వీరికి శ్రీకృష్ణ మినరల్స్ యజమాని సంతోష్‌ప్రధాన్, జాన్‌డీర్ ట్రాక్టర్స్ బహుమతులు స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గిన్ని తిరుపతిరెడ్డి, చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, బరాటం జయప్రకాశ్, వ్యాపారవేత్త ఇప్పిలి కేశవరావు, నిర్వాహకులు జగన్నాథ్‌మహరణ, రాయవలస తిరుమల పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

ఇచ్ఛాపురం: వాహనాలు నడిపేవారికి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని సీఐ ఆర్‌ఈ సీహెచ్ ప్రసాద్ హెచ్చరించారు. పట్టణంలోని బస్టాండ్ కూడలిలో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎటువంటి లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపేవారికి అపరాధ రుసుము విధించారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

15వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

కోటబొమ్మాళి: మండలంలోని 38 పంచాయతీల్లో 15,510 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు సివిల్ సప్లయ్ డీటీ రాము, వ్యవసాయాధికారి గోవిందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నిమ్మాడ, కిష్టుపురం, రేగులపాడు, తాలారు, తర్లిపేట, మహసాహెబ్‌పేట, నీలంపేట ఆర్‌బీకేల్లో ధాన్యం సేకరణ టార్గెట్ పూర్తయిందన్నారు. అదనంగా సేకరించేందుకు అనుమతి కోసం కలెక్టర్‌కు నివేదించామని పేర్కొన్నారు. రైతులు, మిల్లర్లు అధికారులకు సహకరించాలని కోరారు.

రహదారి భద్రతా వారోత్సవాలు

కవిటి: మండలంలోని కరపాడు టోల్‌ప్లాజా వద్ద ప్రాజెక్ట్ మేనేజర్స్ సింథిల్ కుమార్, వీవీకేఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ, భద్రతా ప్రతిజ్ఞ, రహదారుల భద్రతపై అవగాహన కల్పించారు. వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

‘వివరాలు పరిశీలించండి’

కోటబొమ్మాళి: మండలంలో 38 పంచాయతీల్లోని బీఎల్‌వోలు ఆయా పంచాయతీల ఓటరు లిస్టులను పరిశీలించాలని తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ ఆదేశించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి చెందిన బీఎల్‌వోలతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ప్రతీ పంచాయతీలో చనిపోయినవారిని గుర్తించిఓటరు లిస్టుల నుంచి పేర్లను తొలగించాలన్నారు. అలాగే ఒక మనిషికి రెండు ఓట్లు ఉంటే వాటిని గుర్తించి ఒక ఓటును మాత్రమే జాబితాలో ఉంచాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన గుడియా శ్రీను పక్షవాతానికి గురై స్థానిక బస్టాండ్ కూడలిలో తలదాచుకుంటున్నాడు. అతని పరిస్థితి తెలుసుకున్న అలియన్స్ క్లబ్ సభ్యులు బాలకృష్ణ, బత్తుల వెంకటరమణలు నడిచేందుకు వాకింగ్ స్టాండ్, రూ.5 వేల ఆర్థిక సాయం, దుపట్లను అందజేశారు. కార్యక్రమంలో నరసింహమూర్తి, లక్ష్మణరావు, సత్యమయ్య, డి గోపినాద్‌రెడ్డి, ఉమాశంకర్, రమణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

‘పార్టీ బలోపేతానికి కృషి’

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి అన్నారు. ఈ మేరకు నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించి, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి, జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ ఎం.సర్వేశ్వరరావు, పార్టీ నాయకులు పనపల అన్నాజీరావు, అంబటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: ఈనెల 26 నుంచి చేపట్టనున్న చేయి చేయి కలుపుదాం కాంగ్రెస్‌ను నడుపుదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం టెక్కలిలో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ నియామకాలు చేపట్టారు.

పరామర్శ

కంచిలి: మండలంలోని తలతంపర గ్రామంలో మంగళవారం రాత్రి పీచుతో తాళ్లు తయారు చేసే కేంద్రంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో అక్కడే ఉన్న పీచుతోపాటు, తాళ్లు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి బుధవారం ఘటనా స్థలానికి వెళ్లి బాధితుడు టొంకాధర్ బిసాయిని పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, సర్పంచ్ జగబంధు, లడ్డుకేశవపాత్రో, పురుషోత్తం దొళాయి, జద్దు మణిసాహు తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం రూరల్: సాంప్రదాయ వస్త్రధారణలో లొద్దపుట్టి ఉన్నత పాఠశాల బాలికలు


వజ్రపుకొత్తూరు రూరల్: డోకులపాడులో సాంప్రదాయ దుస్తులతో చిన్నారులు


కవిటి: ప్రభుత్వ పాఠశాలలో సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు

ముందస్తు సంబరం

ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని పలు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి సందడి చేశారు. విద్యార్థినులు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. భోగి మంటలు వేసి వేడుకలు చేపట్టారు. డూ..డూ బసవన్నలు, హరిదాసు కీర్తనలు, కోలాటం, ఉట్టికొట్టే కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


టెక్కలి: పోలవరం పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


ఇచ్ఛాపురం రూరల్: సత్యసాయి పాఠశాలలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు


సోంపేట: బుసాభద్ర ప్రాథమికోన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు


టెక్కలి: పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాంప్రదాయ వేషధారణలో విద్యార్థులు


ఇచ్ఛాపురం: బెల్లుపడ ప్రాథమిక పాఠశాలలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు


ఇచ్ఛాపురం రూరల్: భోగి మంటల చుట్టూ నృత్యాభినయం చేస్తున్న విద్యార్థులు


కవిటి: ప్రభుత్వ పాఠశాలలో భోగి మంటలు వేస్తున్న దృశ్యం


వజ్రపుకొత్తూరు: ముగ్గులు వేస్తున్న పాఠశాల చిన్నారులు


వజ్రపుకొత్తూరు: చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి


కాశీబుగ్గ: బాలికల వసతి గృహంలో...


వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవులో సంక్రాంతి సందడి


కవిటి: కల్యాణి పాఠశాలలో సంప్రదాయ వేషధారణలో చిన్నారులు

ప్రారంభమైన క్రికెట్ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న రామకృష్ణ

మందస: మండలంలోని ఉద్దాన ప్రాంతమైన నారాయణపురంలో ఉద్దానం బైకాల పోలమ్మ తల్లి క్రికెట్ పోటీలు మల్లేనవారిపేట మైదానంలో బుధవారం ప్రారంభమయ్యాయి. అగ్నికుల క్షత్రియ జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మడియా రామకృష్ణ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొరకల కేశవరావు, సచివాలయం కన్వీనర్ గొరకల పోలయ్య, జగన్, నిర్వాహకులు జి.ఈశ్వరరావు, డి.గణేశ్, జి.బాలకృష్ణ, మాజీ సర్పంచ్ బొంగు దామోదర్, ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

‘క్రీడల్లో భాగస్వామ్యం శుభపరిణామం’


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

టెక్కలి: విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తున్న సంఘాలు క్రీడల నిర్వహణలో భాగస్వాములు కావడం శుభపరిణామమని విశ్రాంత ఉప విద్యాశాఖాధికారి కె.అప్పారావు అన్నారు. డీవైఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సంక్రాంతి సంబరాల పేరిట రెండు రోజుల పాటు నిర్వహించనున్న వాలీబాల్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాగే విద్యార్థి సంఘాలన్నీ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీయాలని సూచించారు. పోటీల్లో మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మూడో బహుమతి రూ.3 వేలతో పాటు మిగిలిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు కె.గణేష్, ఎం.శివ, యు.దుర్గాప్రసాద్, చందు, సంతోష్, తారక్, సాయికిరణ్, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎన్.గణపతిరావు, సీఐటీయూ నాయకులు ఎన్.షణ్ముఖరావు, కె.ఎల్లయ్య, హెచ్.ఈశ్వరరావు, పీడీలు జి.రాజేష్, రఘు, శ్యామ్, జె.జె.రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

తైక్వాండోలో సత్తాచాటిన విద్యార్థినులు

టెక్కలి రూరల్: మండలంలోని పెద్దసాన ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులు తైక్వాండో పోటీల్లో సత్తాచాటారని హెచ్‌ఎం టి.అబ్దుల్ స్వామి తెలిపారు. ఈ నెల 6, 7, 8వ తేదీల్లో తెలంగాణలో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థినులు ఆర్.ఢిల్లేశ్వరి, బొడ్డేపల్లి మాధురి రజత పతకాలు సాధించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పాండవుల జగదీశ్వరరావు సీనియర్ విభాగం(74-80 కేజీ)లో రజత పతకం సాధించారు. వీరందరినీ బుధవారం అభినందించారు.

సంక్రాంతి కానుకలు అందజేత

కాశీబుగ్గ: స్థానిక శ్రీవాసవి సమితి సభ్యులు 11 నిరుపేద కుటుంబాలకు సంక్రాంతి కానుకగా నిత్యావసర సరుకులు, రెండేసి రైస్ ప్యాకెట్లు, అందరికీ కలిపి రూ.16 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వాసవి సమితి సభ్యులు కోట్ని విజయ్, బోయిన విజయ్, పెంట రత్నాకర్, జామి నాని, సిందిరి నరేష్, సంతోష్, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

కవిటి: మండలంలోని ఉద్దానం యూత్ క్లబ్ ఆఫ్ బొరివంకలో ఉత్కళాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలు, ఒడిశా రాష్ట్రానికి చెందిన మొత్తం 52 జట్లు ఈ టోర్నీలో సత్తా చాటేందుకు దిగాయి. బుధవారం జరిగిన పోటీల్లో పలుజట్లు విజయం సాధించి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించాయి.

రూ.10 వేల విరాళం

మందస: మండలంలోని డబారు గ్రామానికి చెందిన మాజీ సైనికుడు రోకళ్ల తాతయ్య శ్రీవాసుదేవ పెరుమాళ్‌స్వామి ఆలయంలో ఈనెల 14న జరగనున్న గోదాదేవి, రంగనాథుల కల్యాణానికి రూ.10,016 లను బుధవారం విరాళంగా అందజేశారు. ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి వాయలపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో మౌలిక వసతులు

కంచిలి: జగనన్న కాలనీలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల సోషల్ డవలప్‌మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరి మల్లేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని వలంటీర్లతో అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గృహనిర్మాణ శాఖ ఏఈ అప్పారావు పాల్గొన్నారు.

13న కబడ్డీ పోటీలు

వజ్రపుకొత్తూరు: చిన్నమురహరిపురంలో నేను సైతం యూత్ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పోటీల్లో ప్రథమ బహుమతి రూ.8 వేలు, ద్వితీయ బహుమతి రూ. 6 వేలు, తృతీయ బహుమతి రూ.4 వేల నగదుతో పాటు షీల్డు బహుమతులు అందిస్తామని తెలిపా రు. వివరాలకు 9493094054, 7981110442, 7569146561 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జానపదం ఝల్లుమన్నది

● ఉత్సాహంగా జానపద కళాజాత


పాటతో అలరిస్తున్న ఏపూరి సోమన్న, వంగపండు ఉష

పలాస: అదొక పచ్చని పల్లె.. జానపదులకు పుట్టినిల్లు. ఆ ప్రాంతంలో పల్లెపదం జానపదం పరవశించింది. మండలంలోని చిన్ననీలావతి గ్రామంలో సిక్కోలు జానపద కళాజాత ఉత్సాహంగా బుధవారం జరిగింది. కళాకారుల పాటలు ఆకట్టుకున్నాయి. ముందుగా గ్రామంలో గ్రామ దేవతకు చల్లదనం చేశారు. అనంతరం వేదిక వద్ద కళాజాత ప్రారంభమైంది. గ్రామ దేవత రాజమ్మ వేషం, బొడ్డపాడు సన్నాయి మేళం ఎంతగానో అలరించాయి. మాకన్నపల్లి మహిళా కోలాటం, బొడ్డపాడు, గురుదాసుపురం, నీలావతి జానపద గీతాలు, కొర్లాం సుదేష్ణ నమో నమో ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ నృత్యం, రేగులపాడు పీత గంగయ్య తప్పెట గుళ్ల, బాహడపల్లి అందాల కోటేశ్వరరావు ఎరుకుల పాట, విజయనగరం రేలా రేలా రమణ, జానకిరావు, కుత్తుం వినోద్, దాసరి తాతారావు నక్క వాసు, సాలిన అశోక్ కుమార్, సంగారి రాము తదితరులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మంత్రి సీదిరి అప్పలరాజు, టీడీపీ నాయకురాలు గౌతు శిరీష, విశ్రాంత జీఎస్టీ అసిస్టెంట్ జుత్తు తాతారావు, నీలావతి సర్పంచి సార్ల తిరుపతిరావు, మాకన్నపల్లి సర్పంచి సైని దేశయ్య, సంస్థ గౌరవ అధ్యక్షుడు బొడ్డు గాంధీ, గేదెల తులసయ్య, మామిడి కృష్ణారావు, కుత్తుం వినోద్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ సాయికృష్ణ, మందస ఎంపీపీ డొక్కర దానయ్య, వజ్రపుకొత్తూరు ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి ఉదయ్‌కుమార్, పలాస జెడ్పీటీసీ మచ్చ రత్నాలు, పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, సిక్కోలు జానపద కళాజాతర వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లేన దేవరాజు, అధ్యక్షుడు రాపాక దనరాజు, గౌరవాధ్యక్షుడు డాక్టరు కుమార్‌నాయక్, ప్రచార కార్యదర్శి కుత్తుం వినోద్ తదితరులు పాల్గొన్నారు.


పాట పాడుతున్న అసిరయ్య


పాట పాడుతున్న పల్సర్ బైక్ ఫేమ్ రమణ


కళాజాతకు హాజరైన జనసంద్రం

చిరు వ్యాపారులకు ‘జగనన్న తోడు’


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: చిరు వ్యాపారులకు వడ్డీల బాధలు లేకుండా జగనన్న తోడు పథకం అండగా నిలుస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. మున్సిపాలిటీలోని 12, 13 వార్డు సచివాలయం ఆవరణలో జగనన్న తోడు పథకం కార్యక్రమాన్ని మెప్మా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, మెప్మా సీఎంఎం జానకిరామారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

నందిగాం: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి తెలిపారు. మండలంలోని బోరుభద్ర పంచాయతీ కంచిడిూరులో మంచినీటి బోరు ఏర్పాటుకు సర్పంచ్ కవిటి ఎర్రన్న, కురమాన బాలకృష్ణారావుతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అంబోడి విష్ణు, పూడి ఆశారాణి, కణితి రామచంద్రుడు, కవిటి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్ధ మనోహరం.. వాసుదేవుని రూపం

మందస: వాసుదేవుని ముగ్ధమనోహర రూపాన్ని తిలకించి, భక్తులు పారవశ్యం చెందుతున్నారు. వాసుదేవపెరుమాళ్‌స్వామి ఆలయానికి వేదపండితులు ధనుర్మాస ప్రత్యేక శోభను తీసుకువచ్చారు. ధనుర్మాస వ్రతం 27వ రోజులో భాగంగా గోదాదేవి తరపున 108 గిన్నెల్లో విశేష పాయస నివేదనను ప్రధాన అర్చకులు దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు సమర్పించారు.

వాసుదేవునికి కూడారై పాశుర విన్నపాన్ని సమర్పిస్తున్న దృశ్యం →

